JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రభాత
# జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 08-03-2026

Medchal - Malkajgiri । Sunday 08-03-2026

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 281

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 281 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889

call me

jayabheripaper@gmail.com





# దేశ చరిత్రలోనే అతిపెద్ద లొంగుబాటు

మావోయిస్టు అగ్రనేత గణపతికి, అజ్ఞాతంలో ఉన్న ఇతర నక్సలైట్లకు నా విజ్ఞప్తి. ప్రభుత్వ పిలుపు మేరకు 130 మంది నక్సలైట్లు తమ ఆయుధాలను అప్పగించి జన జీవన స్రవంతిలో కలిశారు. మీరు కూడా జన జీవన స్రవంతిలో కలవండి. మెరుగైన జీవనం సాగించడానికి చట్టబద్ధంగా చేయగలిగిన అన్ని సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుంది. హింస ద్వారా ఏదీ సాధించలేం. ఎంతటి సమస్యకైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుంది. జన జీవన స్రవంతిలో కలిసి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిందిగా మీ అందరిని కోరుతున్నాను.

- సీఎం రేవంత్ సమక్షంలో 130 మంది మావోయిస్ట్‌ల సరెండ్
- ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోవడం తొలిసారి
- 2024 జనవరి నుంచి ఇప్పటివరకు తెలంగాణలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు

**జయభేరి, హైదరాబాద్ :**

ఆయుధాలు, హింస ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకదని, ప్రజాస్వామిక మార్గంలోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అజ్ఞాత మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి వచ్చి, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. లొంగిపోయే మావోయిస్టులకు ప్రాణరక్షణ కల్పించడంతో పాటు, సాధారణ జీవితం గడిపేందుకు ప్రభుత్వం అన్ని రకాల సాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మావోయిస్టులు జనజీవనంలోకి రావాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని ఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు తమతో పాటు 124 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోవడం తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలవాలన్న రాష్ట్ర ప్రభుత్వ పిలుపును విశ్వసించి మావోయిస్టులు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. లొంగిపోయిన వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా, వారికి ఆర్థిక సహాయం, ఇతర వసతులు ...మిగతాది 2 లో

## 6వేల కోట్ల ఆదాయంతో గూగుల్ సీఈవో

- 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టిన నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు





2 లో

**జయభేరి, హైదరాబాద్, మార్చి7 :**

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది.

## రాష్ట్రపతిని అగౌరవపరుస్తారా..

- ఇదేం పద్ధతి.. టీఎంసీ సర్కార్ తీరుపై ప్రధాని మోదీ ఫైర్
- ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం: ధర్మేంద్ర ప్రధాన్
- ఇది టీఎంసీ ప్రభుత్వంలోని కుళ్ళు బయటపడిందిః అమిత్ షా



**జయభేరి, న్యూఢిల్లీ:**

బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అగౌరవపరిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఇది సిగ్గుచేటు అని అన్నారు. బెంగాల్‌లోని సిలిగురిలో రాష్ట్రపతి సమావేశానికి వేదిక లేకపోవడం, ప్రోటోకాల్ లేకపోవడంపై రాష్ట్రపతి కలతచెందారు. "బహుశా రాష్ట్ర ప్రభుత్వానికి ...మిగతాది 2 లో




## భారీగా పెరిగిన ఎల్ పీజీ ధరలు

- 14.2 కిలోల గృహ LPG సిలిండర్ ధర ₹60 పెరిగింది
- సిలిండర్ ధరల పెరుగుదల విస్తృతంగా భయాందోళనలకు గురిచేసింది

**జయభేరి, హైదరాబాద్, మార్చి7 :**

మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోంది. ఈ ఘర్షణల కారణంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేశారు. దీని ఫలితంగా దిగుమతి ...మిగతాది 2 లో

## కర్ణుడు కాదు.. కుంభకర్ణుడు

- రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఆగ్రహం



**జయభేరి, మెదక్, మార్చి 7 :**

తాను కర్ణుడిలాంటి వాడినన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కర్ణుడు కాదని, కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. తనను తాను కర్ణుడితో పోల్చుకుంటున్న ముఖ్యమంత్రి మహాక్రూరుడు అని మండిపడ్డారు.కర్ణుడు మాటతప్పని వాడని, తన కవచ ...మిగతాది 2 లో




## మండుతున్న సూర్యుడు

- మరి రాబోయే 3 రోజులు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయంటే?

**జయభేరి, హైదరాబాద్ :**

ఈ ఏడాది సమ్మర్ సీజన్ కాస్త ఎర్లీగానే వచ్చిందని చెప్పాలి. ఎందుకంటే ఫిబ్రవరి చివరి వారంలోనే మాడు పగిలే ఎండలు కనిపించాయి. ఇదిలా ఉండగా తాజాగా భారత వాతావరణశాఖ జారీ చేసిన హెచ్చరికలు జనాలను మరింత భయపెట్టేలా ఉన్నాయి. రాబోయే మూడు రోజుల్లో ఉదయం 9 గంటలకే ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు దాటనున్నట్టు తెలిపింది. ఇప్పటితో పోల్చుకుంటే రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. నేడు, రేపు, ఎల్లుండి వేడిగాలులు పరిస్థితులు, ఆకాశం నుండి నిప్పులు కురుస్తున్నట్లు అనిపిస్తుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక మార్చి రెండో వారం నుంచి ఎండలు మరింత పెరుగుతాయని, పగటి పూట ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతారని ఐఎండీ వెల్లడించింది. కాబట్టి జనాలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.

## సంస్కరణల వల్లే మనదేశం అభివృద్ధి చెందుతుంది

- ఢిల్లీ 'రైసినా డైలాగ్' సదస్సుకు సిఎం చంద్రబాబు హాజరయ్యారు



2 లో

**జయభేరి, న్యూ ఢిల్లీ :**

ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందేనని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. డిప్లొమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుందని అన్నారు. ఢిల్లీ 'రైసినా డైలాగ్' సదస్సుకు సిఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో ఆయన ప్రసంగించారు. మూడు దశాబ్దాల క్రితమే ఐటీ విస్తరణ గురించి చెప్పానని, హైటెక్ సిటీని, సైబరాబాద్ ను అభివృద్ధి చేశానని, తెలియజేశారు. 1995లో సిఎం అయ్యాక ఐటి రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని, అమరావతిలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. పెట్టుబడులతో వచ్చేవారికి జాప్యం లేకుండా అనుమతి ఇస్తున్నామని, అనేక విషయాల్లో కేంద్రంతో కలిసి ముందుకెళ్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## అతిపెద్ద లొంగుబాటు

కల్పిస్తామనే నమ్మకం కలిగించిన పోలీసు ఉన్నతాధికారులను అభినందించారు. మహాత్మా గాంధీ తన శాంతియుత పోరాటంతో ఒక యుద్ధాన్ని జయించిన స్థాయిలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎంత పెద్ద సమస్యకైనా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని, నేడు దేశాల మధ్య యుద్ధాలు జరిగినా చివరకు చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు ముఖ్య నేతలు దేవ్ జీ, దామోదర్, రాజిరెడ్డి, చంద్రన్న తదితరులతో సమావేశమైనప్పుడు వారి పునరావాసానికి సంబంధించిన కొన్ని ప్రతిపాదనలు తన ముందుంచారని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రతిపాదనలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు తెలంగాణలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మెరుగైన ఆర్థిక ప్యాకేజీపై కేంద్ర ప్రభుత్వంతో, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ఇందిరమ్మ ఇళ్లతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనల మేరకు చట్టపరమైన అంశాలను పరిశీలించి, కేసుల ఎత్తివేతపై ఆలోచన చేస్తామని, అవసరమైతే కేసుల పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సమాజంలో హింసకు స్థానం లేదని, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతే వారికి ఆరోగ్యం, ఆర్థిక వెసులుబాటు, నివాస వసతి కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సమక్షంలో మావోయిస్టుల లొంగుబాటు సందర్భంగా DGP శివధర్ రెడ్డి, అదనపు డీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇతర అధికారులు ఉన్నారు.

## మనదేశం అభివృద్ధి చెందుతుంది

సంస్కరణల వల్లే మనదేశం అభివృద్ధి చెందుతుందని, ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారని, అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని కొనియాడారు. గృహోపకరణాలు సినిమా టిక్కెట్లు అంతర్జాతీయ వార్తలు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తుందని, మనదేశం.. భవిష్యత్తులో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుందని అన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఎపి వాళ్లే ఉన్నారని, ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారని అన్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతమే ఉందని, 30 ఏళ్ల క్రితం కుటుంబనియంత్రణ పాటించాలని చెప్పామని, ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉండాలని చెబుతున్నామని అన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తామని, భవిష్యత్తులో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్ కే ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వృద్ధుల సంఖ్య పెరుగుదల, పాపులేషన్ మేనేజ్ మెంట్.. చాలా కీలకమని అన్నారు. ప్రపంచ అత్యుత్తమ కంపెనీల్లో పనిచేసే వారిలో ఎపి వాళ్లే ఎక్కువ అని.. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నామని, ఎపి డ్రోన్ సిటీ, ఎరోస్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆరోగ్యరంగంలో పెనుమార్పులు వస్తాయని, త్వరలో డ్రోన్ అంబులెన్స్ లు కూడా వస్తున్నాయని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## కర్ణుడు కాదు కుంభకర్ణుడు

కుండలాలను కూడా దానం చేసిన త్యాగధనుడని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడిలాంటి వాడే అయితే రైతు బంధు ఏది, ఇల్లు కూలగొట్టి విధ్వంసం సృష్టించడం ఎందుకని నిలదీశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్, ఆరు గ్యారెంటీ హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు.కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసానికి కేరాఫ్ అని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు.రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చవచ్చని హరీశ్ రావు అన్నారు. ఎందుకంటే ఎన్నికలు రాగానే ఆయన నిద్రలేస్తారని, ఎన్నికలయ్యాక కేసీఆర్, బీఆర్ఎస్ మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు వేసిందని గుర్తు చేశారు.

## భారీగా పెరిగిన ఎల్ పీజీ ధరలు

చేసుకున్న వస్తువుల ధరలు పెరిగాయి. అందుకే భారత్‌లోని LPG గ్యాస్ సిలిండర్ల ధర కూడా పెరిగింది. భారత్ అంతటా అనేక రాష్ట్రాల్లో LPG సిలిండర్లు ఖరీదైనవిగా మారాయి. 14.2 కిలోల గృహ LPG సిలిండర్ ధర ₹60 పెరిగింది. హైదరాబాద్‌లో 965 రూపాయలు, ఢిల్లీలో, 14.2 కిలోల గృహ LPG సిలిండర్ ధర ₹853 నుంచి ₹913 కు పెరిగింది. కొత్త రేట్లు అమలులోకి వచ్చాయి. హైదరాబాద్‌లో 19 కిలోల వాణిజ్య LPG సిలిండర్ ధర కూడా ₹115 పెరిగింది, ఈరోజు మార్చి 7 నుంచి అమలులోకి వస్తుంది. హైదరాబాద్‌లో 19 కిలోల వాణిజ్య LPG సిలిండర్ ధర ఇప్పుడు 1,961 రూపాయలుగా ఉంది. ఇది కొత్త ధర అమల్లోకి వచ్చిన తర్వాత ₹2,076 అయ్యింది. సిలిండర్ ధరలలో ఈ కొత్త మార్పు ఏప్రిల్ 2025 ధరల పెరుగుదల తర్వాత జరిగింది. ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య LPG సిలిండర్ ధర కూడా ₹115 పెరిగింది, 19 కిలోల వాణిజ్య LPG సిలిండర్ ధర ఇప్పుడు ₹1,883. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో, వాణిజ్య LPG సిలిండర్ ధర ₹1,835 అవుతుంది. సిలిండర్ ధరల పెరుగుదల విస్తృతంగా భయాందోళనలకు గురిచేసింది. దీని వలన హోర్ముజ్ జలసంధి ద్వారా దిగుమతి చేసుకునే LNG సరఫరాకు అంతరాయం కలిగింది. ఫిబ్రవరి 28 నుంచి హోర్ముజ్ జలసంధి ద్వారా LNG సరఫరాలు నిలిచిపోయాయి. ఇది తాత్కాలికంగా ప్రపంచ LNG సరఫరాలలో దాదాపు 20 శాతంపై ప్రభావం చూపింది. ఆసియా దిగుమతి మార్కెట్లలో ఆందోళనలను రేకెత్తించింది. భారత్ LNG సరఫరాలలో ఎక్కువ భాగం ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి హోర్ముజ్ జలసంధి ద్వారా వస్తుంది.

## 6వేల కోట్ల ఆదాయంతో గూగుల్ సీఈవో

ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్&పీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి. కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# యుద్ధంలో మిగిలేది విజయగర్వం కాదు.. శూన్యమే



యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే ".. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పథం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది. ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికాఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం.

యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు." అని శ్రీశ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం ము గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్‌లకు రేపు యుద్ధం చేయాలనుకునే మరో దేశానికీ అదే పరిస్థితి వస్తుంది. ఆధునిక కాలంలో యుద్ధం అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, అది ఒక తరం మేధస్సును, సృజనాత్మకతను అణచివేసే చీకటి అధ్యాయం. యుద్ధం వల్ల కలిగే మానసిక గాయాలు, అస్థిరత సమాజంలో విద్వేష బీజాలను నాటుతాయి. మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది.. ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న నేతలు గుర్తు తెచ్చుకోవాలి. చరిత్ర పుటల్లో తమ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే కొందరు పాలకుల వ్యక్తిగత అహంకారం, నేడు లక్షలాది మంది సామాన్యుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తోంది. యుద్ధాన్ని ఒక దౌత్యపరమైన సాధనంగా కాకుండా, తమ ఉనికిని చాటుకునే ప్రచార అస్త్రంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం. డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలు కూడా యుద్ధాల వల్ల కలిగే అపారమైన ఆర్థిక నష్టాన్ని, వనరుల దుర్వినియోగాన్ని ప్రస్తావిస్తున్నారంటే, యుద్ధం అనేది కేవలం ప్రాణ నష్టమే కాదు, ఒక దేశపు ఆర్థిక మూలాలను దెబ్బతీసే అత్యంత ఖరీదైన వ్యర్థం అని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో రాబోయే ఊహాజనిత ముప్పులను అడ్డుకోవా లనే భ్రమలో, వర్తమానంలో ఉన్న శాంతిని, స్థిరత్వాన్ని పణంగా పెట్టడం పాలకుల విజ్ఞతకు నిదర్శనం కాదు, అది వారి రాజకీయ బాధ్యతారాహిత్యమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల ప్రథమ కర్తవ్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కానీ క్షిపణుల ప్రయోగాలే పరాక్రమంగా భావిస్తున్నారు. వివేకవంతులైన పాలకులు యుద్ధాన్ని నివారించడంలోనే తమ గొప్పతనాన్ని వెతుక్కోవాలి తప్ప, యుద్ధాన్ని సృష్టించడంలో కాదు.

### యుద్ధాన్ని అంతం చేయకపోతే యుద్ధమే మనల్ని అంతం చేస్తుంది !

ఆధునిక ప్రపంచంలో పాలకులకు కావాల్సింది యుద్ధ క్షేత్రంలో ప్రదర్శించే పరాక్రమం కాదు, చర్చల విషయంలో ప్రదర్శించే దౌత్యనీతి. చరిత్రను అధ్యయనం చేయడం అంటే కేవలం గతంలో జరిగిన యుద్ధాల విజయగాథలను నెమరువేసుకోవడం కాదు.. ఆ ఘర్షణలు మిగిల్చిన రక్తపాతాన్ని, విధ్వంసాన్ని గుర్తించి, అటువంటి తప్పులు మళ్ళీ జరగకుండా చూడటం. శాంతిని కోరుకోవడం అంటే చేతకానితనం కాదు, అది ఒక పరిణతి చెందిన నాగరికతకు, అత్యంత శక్తివంతమైన నాయకత్వానికి నిదర్శనం. క్షిపణుల గర్జనల కంటే చర్చల ద్వారా లభించే పరిష్కారాలే సుస్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. ఈ సత్యాన్ని పాలకులు విస్మరిస్తే, వారు చరిత్రలో నిర్మాతలుగా కాకుండా విధ్వంసకారులుగా మిగిలిపోతారు. రేపటి తరం మన నుండి ఆశించేది కేవలం సాంకేతిక విప్లవం ,ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, సురక్షితమైన , ప్రశాంతమైన జీవన వాతావరణాన్ని కూడా. పాలకుల స్వార్థపూరిత నిర్ణయాలు, బాధ్యతారాహిత్యం వల్ల భూగోళం శిథిలమైతే, ఆ వినాశనానికి ఏ సిద్ధాంతం కూడా ప్రాయశ్చిత్తం చేయలేదు. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఆయుధ పోటీని వీడి, మానవీయ విలువలపై దృష్టి సారించాలి. శాంతియుత సహజీవనం మాత్రమే ఈ గ్లోబల్ విలేజ్ ను కాపాడగల ఏకైక మార్గం. యుద్ధం గెలిస్తే దేశం గెలవొచ్చు, కానీ శాంతి గెలిస్తేనే మానవత్వం గెలుస్తుంది.

## రాష్ట్రపతిని అగౌరవపరుస్తారా..

గిరిజనుల సంక్షేమం గురించి పట్టింపు లేదు, అందుకే ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారు." అని రాష్ట్రపతి ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రకటనపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డారు. "ఇది సిగ్గుచేటు, ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదు. ప్రజాస్వామ్యంలో గిరిజన వర్గాల సాధికారతపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ నిరాశ చెందారు. గిరిజన సమాజం నుండి వచ్చిన రాష్ట్రపతి వ్యక్తం చేసిన బాధ, ఆవేదన భారతదేశ ప్రజలను తీవ్రంగా బాధపెట్టింది" అని ప్రధాని అన్నారు. బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం నిజంగా అన్ని పరిమితులను దాటిందని ఆయన అన్నారు. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి వారి ప్రభుత్వం బాధ్యత వహించాలి. శాంతల్ సంస్కృతి వంటి ముఖ్యమైన అంశాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని ప్రధాన మంత్రి మోదీ పేర్కొన్నారు. ఇదిలావుంటే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం (మార్చి 07) పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతిని స్వాగతించడానికి ముఖ్యమంత్రి కానీ, మరే ఇతర మంత్రి కూడా హాజరు కాలేదు. బాగ్డోగ్రా విమానాశ్రయానికి సమీపంలోని గోసాయ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి రాష్ట్రపతి హాజరయ్యారు. కానీ రాష్ట్ర యంత్రాంగం అక్కడ కార్యక్రమానికి అనుమతి నిరాకరించారు. భద్రత, ఇతర లాజిస్టికల్ కారణాలను చూపుతూ అధికారులు వేదికను బాగ్డోగ్రా విమానాశ్రయం సమీపంలోని గోసాయిపూర్ కు మార్చారు. అంతేకాదు విమానాశ్రయంలో రాష్ట్రపతిని స్వాగతించడానికి హాజరైన ఏకైక ప్రతినిధి సిలిగురి మేయర్ గౌతమ్ దేబ్. ప్రోటోకాల్ ప్రకారం, ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర ప్రభుత్వ మంత్రి సాధారణంగా రాష్ట్రపతిని స్వాగతించడానికి హాజరవుతారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఘాటుగా స్పందించారు. రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమని, ఈ పదవి పవిత్రతను ఎల్లప్పుడూ గౌరవించాలని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం, ఇప్పటికైనా జ్ఞానానికి వస్తాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం: ధర్మేంద్ర ప్రధాన్**

డార్జిలింగ్ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యక్తం చేసిన ఆందోళనలు పరిపాలనా వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయి అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి స్వయంగా ఏర్పాట్లపై బాధ వ్యక్తం చేయాల్సి రావడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని పేర్కొన్నారు. రాష్ట్రపతి కార్యాలయంపై నిర్లక్ష్యం లేదా అవమానం దేశ గౌరవానికే భంగం కలిగిస్తుందని ఆయన అన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవం ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఆదివాసీ సమాజాన్ని గౌరవించే కార్యక్రమాలు మరింత బాధ్యతతో నిర్వహించాల్సిన అవసరం ఉందని ట్వీట్‌లో తెలిపారు.

**ఇది టీఎంసీ ప్రభుత్వంలోని కుళ్ళు బయటపడింది: అమిత్ షా**

బెంగాల్ సర్కార్ తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా విమర్శించారు. రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించడం దారుణమన్నారు. "రాష్ట్రపతి ప్రోటోకాల్ పట్ల స్పష్టమైన నిర్లక్ష్యం చూపించారని, దేశ ప్రథమ పౌరురాలిని అవమానించారని" ఆరోపించారు. సోషల్ మీడియా X లో ఒక పోస్ట్‌లో, తృణమూల్ కాంగ్రెస్ (TMC) ప్రభుత్వం పాలనను అరాచక ప్రవర్తనగా అభివర్ణించారు. ఈ సంఘటన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును బయటపెట్టిందని, ఇది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించినట్లే అన్నారు. రాష్ట్రపతిని అగౌరవపరిచారని ఆరోపించారు. "ఇది టిఎంసి ప్రభుత్వంలోని కుళ్ళును బయటపెడుతుంది. ఇది పౌరుల రాజ్యాంగ హక్కులను ఇష్టానుసారంగా ఉల్లంఘించడమే కాకుండా, భారత రాష్ట్రపతిని నిరంకుశత్వంతో వ్యవహరించారు" అని కేంద్ర హోం మంత్రి అన్నారు. అత్యున్నత రాజ్యాంగ పదవికి చూపిన అగౌరవం.. దేశానికి, భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకు అవమానం అని అమిత్ షా అన్నారు. నేడు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి పౌరుడు తీవ్ర బాధతో ఉన్నారు" అని ఆయన అన్నారు.


## 14 దేశాలకు పాకిన యుద్ధం



**జయభేరి, న్యూయార్క్, మార్చి 7 :**

మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా - ఇజ్రాయెల్ దాడులతో యుద్ధమ మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టుబెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది. చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది. తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాష్ట్ర సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 07 :**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీ సుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీ సత్య నారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శనివారం నిత్య రాబడిలో భాగంగా రూ.20,81,654 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,72,400, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,83,900, శ్రీసత్య నారాయణ వ్రతాల ద్వారా రూ.1,56,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.2,85,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,19,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.69,780, ప్రసాద విక్రయం ద్వారా రూ.6,94,940, కల్యాణకట్ట ద్వారా రూ.56,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**శ్రీవారి సేవలో..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

# మార్చ్ 28వ జాతీయ లోక్ అదాలత్

- **లోక్ అదాలత్ సందర్భంగా పోలీస్ మరియు బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం**
- **సమీక్ష సమావేశం నిర్వహించిన 16వ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ స్వాతి రెడ్డి**
- **కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి**



**జయభేరి, షాద్ నగర్, మార్చి 07 :**

మార్చ్ 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్ సందర్భంగా షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ లో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. చిన్న చిన్న కొట్లాటలు, గొడవలు, వ్యక్తిగత దూషణలు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులలో నిరంతరం కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా ఆయా కక్షిదారులను రాజీపరిచి కేసులను తీసివేసే కార్యక్రమంలో భాగంగా ఈరోజు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి , మండలం న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ స్వాతి రెడ్డి పోలీసు మరియు బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్తరవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి పాల్గొన్నారు. ఈ సమావేశంలో లోక్ అదాలత్ లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా పోలీసులు, బ్యాంకు అధికారులు ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో న్యాయమూర్తులతో పాటు షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, నూతన ఇన్స్పెక్టర్ కే సీతారాం, కొత్తూరు ఎస్సై జి.నర్సయ్య, నందిగామ ఎస్ఐ పి ప్రసాద్, కేశంపేట ఎస్సై నరహరి, కొందుర్గు ఎస్సై బి వెంకటేష్, చౌదర్ గూడా ఎస్సై కే విజయ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్లు పి .రఘువీర్, బి .దీప్తి, సీ .రాజశేఖర్, డి .హనీష్ లతో పాటు కోర్టు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితా ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలి

- **తహసీల్దార్ కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ ధర్నా**
- **ఆలేరు ఎమ్మెల్యే ఇల్లు ముట్టడికి బిఆర్ఎస్ హెచ్చరిక**



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి7:**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని ఇందిరా కాలనీ, బీసీ కాలనీ, యాదగిరిపల్లి, గుండ్లపల్లి సుమారు 762 మంది ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చి నిరుపేద కుటుంబాలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా శనివారం యాదగిరిగుట్ట ఎమ్మార్వో ఆఫీసు ముందు బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా పేద ప్రజలకు చేసింది ఏమి లేదని ,హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చడం తప్ప ఏమి చేయలేదు అని ఆరోపించారు. ఇప్పటికైనా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లను పది రోజుల వ్యవధిలో రెగ్యులరైజ్ చేసి కాంగ్రెస్ తన నిజాయితీ చాటుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 762 ఇళ్ల బాధితులతో ఆలేరు ఎమ్మెల్యే ఇల్లును ముట్టడిస్తాం ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆరే శ్రీధర్,యూత్ అధ్యక్షులు ముక్కెర్ల సతీష్,పార్టీ నాయకులు సతీష్ భట్, ఆత్కూరి అయిలయ్య, రాజేష్,రాజు, మాటూరి బాలయ్య, కంసాని స్వామి, చిరంజీవి, సర్దార్, బాల్ నరసింహ,మిట్ట వెంకటేశ్, దాసరి బాల గురువయ్యతో పాటు ఇళ్ల బాధితులు దుర్గపతి కృషి, మిట్ట బలరామ్, మచ్చ సామేయా, మిట్ట లక్ష్మి నారాయణ, నాగపురి శ్రీను, గౌటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల బలం, ధైర్యం కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఎంతో అవసరం

- **మహిళలు స్వాభావికంగా అసాధారణమైన వారు... అందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు**
- **కేశం పేట్ మండల మాజీ జడ్పిటిసి, కాంగ్రెస్ నాయకురాలు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**




**జయభేరి, షాద్ నగర్, మార్చి 07 :**

మహిళలు స్వాభావికంగా అసాధారణమైన వారు,మహిళల బలం, ధైర్యం కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఎంతో అవసరం అని కేశంపేట్ మండల మాజీ జడ్పిటిసి, కాంగ్రెస్ మహిళా నాయకురాలు తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, షాద్ నగర్ జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, 18వ వార్డు కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి బాయ్ చందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం వర్ధని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.... మహిళా సాధికారత, సమానత్వం, సమన్యాయం పై దృష్టి సారిస్తూ క్రియాశీలమైన సందేశంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. మహిళలు స్వాభావికంగా అసాధారణమైన వారని, మహిళల బలం, ధైర్యం కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఎంతో మేలు చేస్తుంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్, యజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మాసిటీలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ:**


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పరవాడ ఫార్మాసిటీలో మాస్రం మరియు జెఎన్పిసిఎంఎ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు జెట్టి సుబ్బారావు , ఎం. శ్రీనివాస్ రావు , ఎన్. రాజలక్ష్మి పాల్గొని ముందుగా కేక్ కటింగ్ నిర్వహించి మహిళలు అందరకి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారతతో పాటు పని ప్రదేశాలలో,ఇంటి వద్ద భద్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన భద్రతా పలు అంశాలపై చర్చించి ఆయా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఫార్మా కంపెనీలకు చెందిన మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్స్ 2025లో ఆల్ ఇండియా ర్యాంక్ 627 సాధించిన హెరిటేజ్ వ్యాలీ విద్యార్థిని




**జయభేరి, షాద్ నగర్, మార్చి 07 :**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని హెరిటేజ్ వ్యాలీ ది ఇండియన్ స్కూల్ కు చెందిన పూర్వ విద్యార్థిని ఇంద్రార్చిత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2025లో నిర్వహించిన పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల కాగా ఆమె ఆల్ ఇండియా ర్యాంక్ 627 సాధించి విశేష ప్రతిభ కనబర్చింది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మరియు పోటీతో కూడిన ఈ పరీక్షలో ఆమె సాధించిన విజయంతో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ లో చేరే అవకాశముంది. దేశ పరిపాలన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే సేవలో ఆమె ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఏళ్ల తరబడి కృషి, పట్టుదల, అంకితభావంతో సాధించిన ఈ విజయంపై హెరిటేజ్ వ్యాలీ పాఠశాల కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఇంద్రార్చితకు అభినందనలు తెలియజేస్తూ ప్రజాసేవలో ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 07 :**

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామ మాజీ సర్పంచ్ అనుముల వెంకటరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ల పరమేష్ యాదవ్, జెల్ల వెంకటేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాప అశోక్, కనకయ్య, యాదగిరి, బాలరాజు చందు, సంజీవరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలని విద్యార్థులు పెంపొందించుకోవాలి




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 07 :**

భారతదేశం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యమని, ప్రజాస్వామ్య విలువలని విద్యార్థులు పెంపొందించుకోవడమే మాక్ పార్లమెంటు యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని తెలంగాణ స్కూల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్, మంత్రులు ప్రతిపక్ష నాయకులుగా విద్యార్థులు వ్యవహరించారు. విద్యార్థులు పార్లమెంటులో ఏ విధంగా అయితే చర్చలు వాదోపవాదాలు జరుగుతాయో అదే విధంగా విద్యార్థులు మంత్రులు, ప్రతిపక్ష నాయకుల తీరును ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోస్టర్ తయారీపై విద్యార్థికి ప్రథమ బహుమతి




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 07 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి జీవిలికపల్లి భవ్య శ్రీ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌమార విద్య, ఎయిడ్స్ వ్యాధి నిరోధకత అవగాహన పోస్టర్ తయారీపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సోమల కల్పన, ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు దేస శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీష్ కుమార్ ,దూదిపాల జ్యోతి, ముసుకుల సుజాత, చింతలపూడి విశ్వేశ్వరరావు, శ్రీ రాంభట్ల మాధురి, బీరవెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజీ, ఆదరాసుపల్లి వెంకటలక్ష్మి, భూక్య గోవింద్, విద్యార్థిని అభినందించారు.

# పరీక్షా ప్యాడ్స్, జామెంట్రీ బాక్సుల పంపిణీ చేసిన దార నవీన్




**జయభేరి, యాదగిరిగుట్ట మార్చ్ 07 :**

యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లి, దాతరుపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి శరత్ యామిని సమక్షంలో కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర నాయకులు దార నవీన్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్స్, జామెంట్రీ బాక్స్ పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మంచిగా చదువుకొని పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులు దార నవీన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని శ్రీనివాస్, వేముల నరసింహ, డంగు నీరజ్, భాస్కర్, బబ్బి, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 07 :**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకము ద్వారా 10 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దార మహేందర్, ఉపసర్పంచ్ ఆరుట్ల ఉదయ్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రావుల శ్రీనివాస్, వార్డు సభ్యులు కొండపాక మహేష్, రాగుల మల్లేష్, పల్లెపాటి అనిల్, గుంటి లావణ్య, కర్రె ఉపేందర్ గౌడ్ , నరసింహులు గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధితుడ్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని నవోదయ ఆసుపత్రిలో శనివారం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. అనంతరం జిల్లా ఆస్పత్రి లో శుక్రవారం మూసాపేట్ మండలం కొమ్మిరెడ్డి పల్లి గ్రామ సమీపంలో జరిగిన లారీ రోడ్డు ప్రమాదంలో మరణించిన కొత్తకోట మండలం వడ్డేవాటా గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రవీందర్ మరియు కొత్తకోట మున్సిపాలిటీకి చెందిన మరో డ్రైవర్ నాగన్నల కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వారికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండలం కొన్నూర్ పెద్ద తండా ఇండిపెండెంట్ గ్రామ సర్పంచ్ పాత్లవత్ లక్ష్మీ నారాయణ నాయక్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్ మరియు వార్డు సభ్యులు శనివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్ద తాండ గ్రామానికి చెందిన ఇటీవల ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన సర్పంచ్ పాత్లవత్ లక్ష్మీ నారాయణ నాయక్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్ మరియు వార్డు సభ్యులు శంకర్ నాయక్, గోవిందమ్మ మన్యం, బుచ్చమ్మ రమేష్ నాయక్ మరియు ముఖ్య నాయకులు శీను నాయక్, విజయ్ నాయక్, శీను నాయక్, యాది నాయక్ మరియు పలువురు యువకులు, మహిళలు, పలువురు తండా వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే జిఎంఆర్ సాదరంగా ఆహ్వానించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జియంఆర్ పెద్ద ఎత్తున నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నచ్చి, అభివృద్ధిలో భాగ్యస్వాములు అవ్వాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మూసాపేట మండలం సంకల మద్ది లో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలమూరు మాస్టర్ ప్లాన్ పై రివ్యూ

- ఎమ్మెల్యే యెన్నంతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్
- హాజరైన మేయర్, డిప్యూటీ మేయర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మూడ కార్యాలయంలో శనివారం మహబూబ్ నగర్ మాస్టర్ ప్లాన్ పై రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కూడా హాజరయ్యారు. అలాగే స్థానిక మేయర్, డిప్యూటీ మేయర్, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎమ్మెల్యే కృషి ఫలితం

- ఉప్పల్ బాగాయత్ లోనే MMC కార్యాలయం ఏర్పాటు
- సీఎంతో మాట్లాడి బాగయత్ వచ్చే విధంగా కృషి

జయభేరి, ఉప్పల్ :



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా ఉప్పల్ భగాయత్లోని ఆ స్థలాన్ని అధికారులు యుద్ధప్రాతిపదికన చదును చేస్తున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మల్కాజ్ గిరి BRS పార్టీ పార్లమెంట్ ఇంఛార్జి రాగిడిలక్ష్మారెడ్డితో పరిశీలించారు.
అయితే మల్కాజ్గరి కార్పొరేషన్ ఏర్పిడినప్పటి నుంచి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సరి కొత్త భవనం కోసం ఉప్పల్ భగాయలే అనువైన స్థలమని ప్రభుత్వంలోని పెద్దల లోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. నగరానికి అతి చేరువలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా విశాలమైన రోడ్లు, పార్కులతో మూసీకి పక్కనే రూపొందించిన ఉప్పల్ భగాయత్లో స్థలం అందుబాటులో ఉండడంతో పాటు గురువారం ఆగమేఘాల మీద ఆ స్థలాన్ని ఉప్పల్ భగాయత్లో చదును చేస్తున్న ప్రభుత్వ స్థలం ఎంఎంసీ అధికారులు చదును చేయిస్తుండడంతో ఇక్కడే ఏర్పాటు అవుతుంది అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నగరానికి చేరువలో, భౌగోళికంగా మల్కాజ్గరి కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ కేంద్ర బిందువుగా ఉండడం, విశాలమైన, అనువైన స్థలం ఉండడం ఇక్కడే కార్పొరేషన్ కార్యాలయం నిర్మిస్తారనే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాలనీల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీ ల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. కాప్రా డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఎన్క్లేవ్లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, శివా నగర్లో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు, అలాగే సాయి రామ్ నగర్ 2బిహెచ్కే డిగ్నిటీ హౌసింగ్ సొసైటీ పరిధిలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తి అయిన తరువాత స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, అధికారులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సేవకు లభించిన గుర్తింపు

- వరించిన పాలమూరు జిల్లా ఆటో యూనియన్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి
- 2004లో దేవరకద్రలో ఆటో యూనియన్ ఏర్పాటు
- 22 ఏళ్లుగా యూనియన్ సభ్యులకు సేవలు, సేవా కార్యక్రమాలు

జయభేరి, దేవరకద్ర :

శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. చేసిన సేవకు పదవి బహుమతిగా లభించింది. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి చెందిన కెంగూరి రాము ను పాలమూరు జిల్లా తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి లభించింది. దేవరకద్రలో 2004లో శ్రీ వీర గురు ఆటో యూనియన్ పేరిట రాము యూనియన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆటో యూనియన్ సభ్యులకు రాము తమ సేవలు అందిస్తున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. దీనికి గుర్తుగా తెలంగాణ తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్, డ్రైవర్ అసోసియేషన్ వారు రాముకు తెలంగాణ ఆటో యూనియన్ పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి ఎంపిక చేశారు. దీనికిగాను వారు ఉత్తర్వులు కూడా విడుదల చేశారు. ఆటో యూనియన్ తరపున రాము ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు.అలాగే తెలంగాణ మలిదశ ఉద్యమంలో దేవరకద్ర ఆటో యూనియన్ సభ్యులంతా కలిసి తెలంగాణ వచ్చేవరకు ఉద్యమం చేశారు.సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో చేస్తున్న సేవలను గుర్తించి, స్వయంగా ఆహ్వానించి.. తెలంగాణ స్టేట్ ఆటో యూనియన్ జేఏసీ మంద రవికుమార్ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె దస్తగిరి తనకు మహబూబ్ నగర్ జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఎంతో సంతోషంగా ఉందని రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన ఈ గౌరవం నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఇలాంటి ప్రోత్సాహం మా ఆటో యూనియన్ సభ్యులందరూ సమాజానికి ఉపయోగపడే మరెన్నో సేవలను ఇంకా పెద్ద స్థాయిలో కొనసాగించాలని నిర్ణయించుకోవడం జరిగిందని రాము అన్నారు.

## యాదాద్రి మాడ వీధుల్లో జర్మన్ టెక్నాలజీతో షెడ్లు

జయభేరి, యాదాద్రి భువనగిరి :

వేసవిని దృష్టిలో పెట్టుకొని యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం ఆలయ మాడవీధులలో జర్మన్ టెక్నాలజీకి సంబంధించిన షెడ్లు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో తెలిపారు. స్వామి దర్శనార్థమై వచ్చే భక్తులు దిన దినంగా తాకిడి పెరుగుతుండడంతో దర్శన క్యూలైన్లతో పాటు ప్రసాద విక్రశాల శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పండపం దగ్గర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరుతో పాటు మజ్జిగను అందజేసేందుకు వీలుగా విజయవాడ వారితో సంప్రదిస్తున్నట్టు ఆలయ ఈవో తెలిపారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని స్పష్టీకరణ

- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం - మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్..
- యాడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న వజ్రేశ్ యాదవ్. ..

జయభేరి, శామీర్ పేట్, మర్చి 7:



ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటి పరిధిలోని యాడారం గ్రామంలో అంకం లక్ష్మి, భిక్షపతి దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ , అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతి మాధవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాంజాల్ సుజాత ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం అంకం లక్ష్మి మాట్లాడుతూ 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి మాకు సొంతింటి కల నెరవేర్చడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గురకాల దీపికా సాయికృష్ణ ,సరసం వనజా అశోక్ రెడ్డి ,సామల జశ్వంత్ రెడ్డి, ముద్దం సుధాకర్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మరియు మాజీ ప్రజాప్రతినిధులు మందా జగన్నాథం, ముద్దం రాఘవ రెడ్డి, కొమ్ము వినోద్, చిటుకుల రాజశేఖర్ రెడ్డి, మనిగొండ నవీన్, నర్సింగ్ రావు, పాండు, సతీష్, కోడూరి దినేష్, తలారి బాబు, కుడుముల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ పని భద్రత హక్కుల కోసం కదిలిరండి

జయభేరి, పరవాడ:




అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం పరవాడ సిఐటియు కార్యాలయం నుండి సిఐటియు, ఐద్వా , ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 100 ఏళ్ల క్రితమే మహిళలు సమాన హక్కుల కోసం పోరాడారని, పురుషులతో సమానంగా ఓటు హక్కు కావాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళలకు భద్రత కల్పించాలని నినదించారని. క్లారా జట్కిన్ అనే ఆమె నాయకత్వంలో మహిళల హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు జరిగాయని. 1917లో రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదం అయిన తర్వాత మహిళలకు సమాన అవకాశాలు కల్పించారని. అక్కడే ప్రపంచ మహిళా దినోత్సవాన్ని మార్చి 8ని జరపాలని నిర్ణయించారని. దీనికి అనుగుణంగా ఐక్యరాజ్యసమితి కూడా మార్చి 8 మహిళా దినోత్సవం గా ప్రకటించిందని. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నదని. నేడు సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేసే చర్యలు తీసుకు వస్తున్నారని. ప్రతిరోజు మహిళలపై అత్యాచారాలు ,వరకట్న వేధింపులు నిరంతరం పెరుగుతున్నాయని. యుద్ధాలు రావడంతో ప్రధానంగా నష్టపోతున్నది మహిళలు, చిన్నపిల్లలని మహిళను వ్యాపార సరుకుగా ప్రపంచం మార్చేసిందని, మహిళలకు సమాన అవకాశాలు ఒక్క సోషలిస్టు సమాజంలోనే ఉంటాయని అందుకే మహిళలందరూ తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం కానుకగా వంట గ్యాస్ సిలిండర్ 60 రూపాయలకు పెంచిందని. ఇదే చాలా దుర్మార్గమని. కేంద్ర బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకువచ్చి మహిళలకు రాత్రి పూట డ్యూటీలు వేయాలని చట్టం చేశారని, పగటిపూట మహిళలకు భద్రత లేకుండా పోతున్నదని. కావున మహిళల హక్కుల కోసం పని భద్రత కోసం మరిన్ని పోరాటాలకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు రామలక్ష్మి, సుజాత, వివోఏ సంఘం మండల అధ్యక్షురాలు ఎన్ పైడి లక్ష్మి, జీ వరలక్ష్మి, ఆశ యూనియన్ నాయకులు సన్యాసమ్మ,అక్కులమ్మ, తదితరుల పాల్గొన్నారు.

# అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ హస్తిన కాలింగ్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 7:**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీకి పిలవడం ఇప్పుడు హస్తం పార్టీలోనే కాదు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మొన్న వికారాబాద్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ..స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీ వచ్చి కలవమని చెప్పారట. పార్టీ శిక్షణా తరగతుల వేదికైన వికారాబాద్ నియోజకవర్గానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆయన రాహుల్ గాంధీకి స్వాగతం పలకడంతో పాటు వీడ్కోలు చెప్పేందుకు హెలిప్యాడ్ దగ్గరికి వెళ్లిన సందర్భంగా..ప్రసాద్ కుమార్‌తో మాట్లాడిన రాహుల్ ఢిల్లీకి వచ్చి కలవమని ప్రత్యేకంగా చెప్పారని తెలుస్తోంది.

స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను రాహుల్ గాంధీ ఎందుకు ఢిల్లీకి పిలిచారన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో రకరకాలుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, అందులోనూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ స్వయంగా ఢిల్లీ రమ్మని స్పెషల్‌గా స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను పిలిచారంటే సమ్‌థింగ్ ఈజ్ దేర్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏదో బలమైన కారణం లేకుండా రాహుల్ ఎవరినీ ఢిల్లీకి వచ్చి కలవాలని చెప్పరని, అలాంటిది స్పీకర్ పదవిలో ఉన్న ప్రసాద్ కుమార్‌ను హస్తినకు రావాలని పిలిచారంటే కచ్చితంగా ఏదో ఉందని హస్తం పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.ఈ మధ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాలా బిజీగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు కేసులను విచారిస్తున్నారాయన. సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో జంపింగ్ ఎమ్మెల్యేల విచారణను స్పీడప్ చేసిన స్పీకర్ ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇక కడియం శ్రీహరి విచారణ పూర్తి కాగా తీర్పును రిజర్వ్ చేశారు. మరోవైపు ఇంకా దానం నాగేందర్ కేసు తుది విచారణను బాకీ ఉంది. ఇలా పార్టీ ఫిరాయింపుల కేసు విచారణతో స్పీకర్ ప్రసాద్ కుమార్ బాగా విసిగిపోయారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ స్పీకర్ తీరుపై విమర్శలు గుప్పిస్తోంది.

ఇక మరో ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎలాంటి తీర్పు ఇస్తారన్నదానిపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారమంతా స్పీకర్ ప్రసాద్‌కు హెడెక్‌గా మారిందట. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కూడా ప్రసాద్ కుమార్‌కు తలకు మించిన భారంగా మారిందన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి సిచ్యువేషన్‌లో రాహుల్ గాంధీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీకి పిలవడం వెనుక రీజనేంటన్నదానిపై ఉత్కంఠ నెలకొందిపార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్స్‌పై విచారణ క్లైమాక్స్‌కు చేరుకున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించేందుకు పిలిచి ఉంటారా అన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మంత్రివర్గంలో ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అమాత్య పదవుల కోసం చాలా మంది ఆశలు పెట్టుకోగా.. అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రేసులో ఉన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారటమంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు ప్రసాద్ కుమార్ హైకమాండ్ కు లేఖ రాశారు. కానీ అప్పుడు క్యాబినెట్‌లో ఆయనకు చోటు దక్కలేదు. అయితే మంత్రిపదవిపై ప్రసాద్ కుమార్ ఇంకా ఆశలు పెట్టుకున్నారట. ఇలాంటి ఈక్వేషన్స్ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చి కలవమని రాహుల్ గాంధీ చెప్పడంతో గడ్డం ప్రసాద్‌లో మళ్లీ ఆశలు చిగురించాయని అంటున్నారు. మరి స్పీకర్‌ను రాహుల్ ఢిల్లీకి పిలిచింది మంత్రివర్గంలో బెర్త్ కోసమా? లేక ఫిరాయింపు అంశంపై చర్చించేందుకా? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్ వర్గాలతో పాటు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఉత్కంఠ రేపుతోంది.అయితే ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై డిస్కస్ చేస్తే..రాహుల్‌తో భేటీ తర్వాత స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతోంది? మంత్రివర్గంలో చోటు కోసమైతే గడ్డం ప్రసాద్ ప్లేస్‌లో స్పీకర్ అయ్యేదెవరనేది కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రసాద్‌కుమార్‌ను క్యాబినెట్‌లోకి తీసుకుంటే..ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్న ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందంటున్నారు. రాహుల్‌తో స్పీకర్ భేటీ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి.

# అలియాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా ..

- మున్సిపల్ చైర్మన్ కంతం శిరీష కృష్ణారెడ్డి
- లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 7:**



అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధే తన ఏకైక లక్ష్యం అని మున్సిపల్ చైర్మన్ కంతం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో సుమారు 7.50 లక్షల రూపాయల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు, ప్రజలతో కలిసి మమేకం అయి పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగానే లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. రాబోవు రోజుల్లో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతీ మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్లు గాదె వెంకటేశ్, గుర్క కుమార్, కైరా గణేష్, తాళ్ళ స్వప్న రామ్ ప్రసాద్ గౌడ్, యమున శ్యామ్ , ఏఈఈ సన షాహిన్, గ్రామస్థులు కుమ్మరి సిద్దులు, బాబు,నారం రెడ్డి, సుకేష్ రెడ్డి, కృష్ణ రెడ్డి, నల్ల పాండు,నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు ఏఎంసి మాజీ చైర్మన్ పరామర్శ

**జయభేరి, గజ్వేల్, మార్చి 07 :**



గజ్వేల్ మండలం రంగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు మంగలి శ్రీనివాస్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాదితో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ఏఎంసి మాజీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, శనివారం ఉదయం పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతితో పాటు సంతాపం వ్యక్తం చేశారు. అదేవిదంగా అదే గ్రామానికి చెందిన వడ్ల నర్సింహాచారి గుండె పోటుతో మరణించినగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి ఇరు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందివ్వడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్తూ పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం సింగాటం గ్రామానికి చెందిన వంజరి పోచయ్య మొన్న మరణించగా వారి కుటుంబ సభ్యులు ప్రభాకర్, ప్రసాద్ లను పరామర్శించారు. చిన్న అరెపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి మల్లయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాలని సైతం పరామర్శించి విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారి వెంట ఆయా గ్రామాలకు చెందిన brs సీనియర్ నేతలు మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, అహ్మద్, రంగంపేట్ సర్పంచ్ నాగరాజు, దుర్గ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, స్వామి, మనోహర్, సయ్యద్, మల్లేశం, నరేష్, ప్రహ్లాద్, షాదుల్, తదితరులు ఉన్నారు.

# జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

**జయభేరి, దేవరకొండ :**



శ్రీ వాసవి కళ్యాణమండపం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలలో వివిధ హోదాలను వివిధ శాఖలను పనిచేస్తున్న మహిళలను వాసవి వనిత క్లబ్ వీరిని గుర్తించి ఘనంగా శాల్వతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు అదేవిధంగా మెమొంటో అందజేశారు. జడ్పీహెచ్ఎస్ బాలికాల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెబాక టీచర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర గురించి కొనియాడారు అదేవిధంగా వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు, ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సోషల్ సర్వీస్ చైర్మన్ పందిరి జ్యోతి వెంకన్న మాట్లాడుతూ ప్రపంచంలో మహిళల పాత్ర గురించి ఇందిరాగాంధీ ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు గురించి వివరిస్తూ మహిళల పాత్ర ఏ విధంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. వెటర్నరీ డాక్టర్ శ్రీమతి ధనలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో 104A గవర్నర్ వీరలి సతీష్ సెక్రటరీ నూనె కిషోర్ వాయిస్ గవర్నర్ తాళ్లపల్లి రాము వీరయ్య డిస్ట్రిక్ట్ జాయింట్ ట్రెజరర్ నీల సంజీవ్ కుమార్ ,డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ ఆలంపల్లి పద్మ,ఐపిసి బెల్దే మాధవి రవీందర్ ,వాసవి వనిత క్లబ్ కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష, సన్మాన గ్రహీతలు పి.హెచ్వో ప్రేమలత 14వ వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి ,10వ వార్డు కౌన్సిలర్ గుద్దేటి మాధవి సత్యం, వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షులు గుడుగుంట్ల హేమలత, వామ్ రాష్ట్ర నాయకులు చిదెళ్ల శ్రీదేవి, మహాలక్ష్మి ,కళ్యాణి టీచర్ రేణుక టీచర్, గోవింద్ శైలజ లెక్చరర్ నామ పద్మ లెక్చరర్ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ జాయింట్ ట్రెజరర్ ఆలంపల్లి పద్మ పానుగంటి చంద్రకళ కొండ మల్లేపల్లి వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు సముద్రాల స్వప్న ,ఆలంపల్లి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఎస్ సి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ పంపిణీ

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 07:**

యాదగిరిగుట్ట మండల పరిధిలోని యాదగిరిగుట్ట,యాదగిరిపల్లి,దాతరుపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు యాదగిరిగుట్ట మండల విద్యాశాఖ అధికారిణి శరత్ యామిని సమక్షంలో కోమటిరెడ్డి యువ సేన రాష్ట్ర నాయకులు దార నవీన్ పరీక్ష ప్యాడ్,జామెట్రీ బాక్స్, పెన్నులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని శ్రీనివాస్,వేముల నర్సింహ, డంగు నీరజ్,భాస్కర్, బబ్బి, నవీన్ పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి దార నవీన్ చేస్తున్న కృషిని సందర్భంగా యాదగిరిగుట్ట మండల విద్యా శాఖ అధికారి శరత్ యామిని ప్రశంసించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

- యూనియన్ బ్యాంక్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 07 :**

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని యూనియన్ బ్యాంక్ యాదగిరిగుట్ట మేనేజర్ రఘు తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట యూనియన్ బ్యాంక్ బ్రాంచిలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యాపారం, రాజకీయంతో పాటు వివిధ రంగాలకు చెందిన మహిళలతో కలిసి కేట్ కట్ చేశారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం,సామాజిక సంస్థలు కలిసి పనిచేయాలని, మహిళల అభివృద్ధికి అవసరమైన తోడ్పాటునందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సబ్ మేనేజర్ సుమంత్ కుమార్, క్యాషియర్ ఇంద్రజ,మాధురి, సిబ్బంది లావణ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 07 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి, ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొల్లారం నరసింహ, వార్డు సభ్యులు నల్లరాజు ధ్యాన బోయిన రాణి, పోషాలు, ఆశా వర్కర్ భాగ్యమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, కారోబార్ ఎరుకల స్వామి గౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# అలివేలు మంగతాయారు దేవస్థానం హుండీ లెక్కింపు

- రూ.10,09,442 ఆదాయం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన అలివేలు మంగ తయారు అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపును శనివారం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన హుండీ లెక్కింపు రాత్రి 7 గంటలకు ముగిసింది. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఈ హుండి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయానికి హుండీ పరంగా రూ. 10,09,442ల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాస రాజు, మహబూబ్ నగర్ ఐడిబిఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున్, మహబూబ్ నగర్ సత్యసాయి సేవ సమితి వారు భక్తులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి, మాజీ జడ్పీ చైర్మన్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి జి.కవిత మధుసూదన్ రెడ్డి తో పాటు మాజీ జడ్పీ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే సతీమణి తో పాటు మాజీ జడ్పీ చైర్మన్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.




# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రశాంత్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి లతోపాటు దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అందరూ పురుషులతోపాటు సమానంగా రాజకీయంగాను, ఆర్థికంగాను ఎదగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఉన్న అవకాశాలను అంది పుచ్చుకోవాలని, ప్రతి ఒక్క మహిళా ఎంటర్ ప్రేనుర్ గా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ పద్మజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్నికల్లో పోటీ చేసిన మహిళా కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్లు, సర్పంచులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

# ఈ బోనంగిలో అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ఈ బోనంగి గ్రామపంచాయతీ పరిధిలోని బోద్దపువానిపాలెంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వేకువజామున నుండి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఆలయానికి విచ్చేసి శ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మేడిశెట్టి బాలాజీ నాయుడు, ఐన్టియూసి నాయకులు మంత్రి గిరిప్రసాద్, బోద్ధపు బాలాజీ నాయుడు, బోండా శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు సహా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మూడు చింతల పల్లి మున్సిపాలిటీలో నూతన ఫాగింగ్ మిషన్ ప్రారంభం

- అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న మున్సిపల్ చైర్మన్ జాం రవి..

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 7:**

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మూడు చింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి మరియు కమిషనర్ పవన్ కుమార్ లు అన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలో నూతన ఫాగింగ్ మిషన్ ను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు గాను ఈ ఫాగింగ్ మెషిన్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ ఫాగింగ్ మెషిన్ ద్వారా పట్టణంలోని అన్ని వార్డుల్లో నిరంతరం ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చైర్మన్ తెలిపారు.పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించడానికి ఫాగింగ్ కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం : మున్సిపల్ చైర్మన్ జాం రవి,



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 7:**

ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోతారం, నారాయణపూర్, అనంతారం వార్డు కార్యాలయాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ పవన్ కుమార్ లు పాల్గొన్నారు. అనంతరం రహదారులను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రహదారులను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వంగ ప్రియాంక రెడ్డి, ముద్దం పాపిరెడ్డి, ర్యాకల నీరజ్ గౌడ్, నవీన్ నాయక్, చిన్న లచ్చ సరిత శ్రీనివాస్, పెద్దిరెడ్డి శ్రీలత, రాజిగల్ల లత, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జానంపేటలో ప్రజా పాలన

- హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- వైద్య శిబిరం విజయవంతం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం జానంపేటలో శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరానికి హైదరాబాద్ నుండి వచ్చిన ప్రముఖ వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అర్చరీ పోటీలకు జట్లు ఎంపిక




**జయభేరి, పరవాడ:**

ఉమ్మడి విశాఖ జిల్లా అర్చరీ సంఘం ఆధ్వర్యంలో పరవాడ మండలంలో ఉన్న సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో అండర్ 15, అండర్ 13, అండర్ 10 విభాగలలో జిల్లా నలుమూలల నుండి సుమారు 45 మంది హాజరవగా వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన ఇరువై నాలుగు మంది క్రీడాకారులు నూజివీడు లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె. నిశాంత్ తెలిపారు.రాష్ట్ర స్థాయి లో పాల్గొనుచున్న క్రీడాకారులను ఉమ్మడి విశాఖ జిల్లా అర్చరీ సంఘ అధ్యక్షులు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ, కోశాధికారి పి. భాస్కర్,సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి అభినందనలు తెలుపగ, ఈ పోటీలను చక్కగా నిర్వహించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ క్రీడా శిక్షకులు శివకుమార్, గోవింద్ లను జిల్లా కార్యదర్శి కె. నిశాంత్ అభినందనలు తెలిపారు.

# ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..!

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు శక్తి స్వరూపులు అంటూ నేటి చరిత్ర నుంచి నేడు డిజిటల్ యుగం వరకు మహిళలు ప్రతి రంగంలో తమ ముద్ర వేసుకుంటున్నారు అని, ఒక ఇంట్లో ఇల్లాలుగా, ఆఫీసులో ఉద్యోగిగా, దేశ రక్షణలో సైనికురాలిగా, అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తున్నారని, మహిళా శక్తి అనేది కేవలం మాటల్లోనే కాదు చేతల్లో కూడా చూపిస్తున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్క మహిళకు ఏ సమస్య ఎదురైన అవి తీర్చే క్రమంలో నేను ముందుంటా అని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు నిర్వహించిన ఆటలు పాటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో మహిళలు, ఉప్పల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.







## 10 వార్డులో విద్యుత్ స్తంభాలు సమస్య కు పరిష్కారం

**జయభేరి, కొండ మల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో 10 వ వార్డు లో విద్యుత్ స్తంభాలు సమస్య ఉండడంతో వెంటనే సర్పంచ్ యుగేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి కరెంట్ ఏఈ తో మాట్లాడి 10 వ వార్డులో స్తంభాలు వెయ్యడం జరిగింది. 10 వ వార్డు ప్రజలు మా కాలనీకి విద్యుత్ సమస్య ను తొలగించినందుకు సర్పంచ్ యుగేందర్ రెడ్డి కి, వార్డు సభ్యుడు బిజిలి లింగంకు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యుడు బిజిలి లింగం 10 వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి అండగా నిలిచిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం హనుమాన్ నగర్‌కు చెందిన శ్రీనివాస్ చారీ (తనీష్), తండ్రి రవీంద్ర చారీ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన మన్నెగూడలోని AVS హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ హాస్పిటల్‌కు వెళ్లి శ్రీనివాస్ చారీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. డాక్టర్ కి బాధితులకి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇస్తూ, తక్షణ సహాయం కింద 20,000/ రూపాయల (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేశారు ఇంకా ముందు ఎలాంటి అవసరాలున్న అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ తో పాటు ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ మోడల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు




**జయభేరి, మేడ్చల్ :**

సుచిత్ర గౌతమ్ మోడల్ స్కూల్ ప్రీప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం సుచిత్రలోని స్వాగత్ గ్రాండ్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల విద్యాభ్యాసంలో మొదటి మెట్టు అయిన ప్రీప్రైమరీ దశ ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ దశలోనే పిల్లల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. గురువుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు మంచి భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ కల్పన వైస్ ప్రిన్సిపల్ స్వరూప రాజ్ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేసవి కాలం దృష్ట్యా వాటర్ డిస్పెన్సర్ ఏర్పాటు

- ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**




పెరుగుతున్న ఎండల దృష్ట్యా కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని, ఆ ఉద్దేశంతోనే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఆర్.వి (RV) ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి నేడు మేడిపల్లిలోని ఎంఆర్ఓ కార్యాలయంలో వాటర్ డిస్పెన్సర్‌ను ఏర్పాటు చేశారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలు, వృద్ధులు మంచినీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ వాటర్ డిస్పెన్సర్ ద్వారా కార్యాలయ సిబ్బందితో పాటు, పనుల నిమిత్తం వచ్చే సందర్శకులకు నిరంతరం చల్లని మంచినీరు అందుబాటులో ఉంటుంది. ఆర్.వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తుంగతుర్తి రవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి తహసీల్దార్ కృష్ణ చైతన్య, DT సైది రెడ్డి, Ri లు రాకేష్, చంద్రకళ, హరీష్, ఘట్కేసర్ మండల అధ్యక్షులు కర్రె రాజేష్, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,పఠాన్,నితిన్, శివాజీ, శ్రీనివాస్, రాజు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిచి ఉన్నతంగా ఎదగాలి

**జయభేరి, కొండమల్లేపల్లి :**



విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిచి ఉన్నతంగా ఎదగాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి లోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించిన కల్చరల్ మహోత్సవ్ 2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో విద్యతో పాటు ఇలాంటి కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.విద్యార్థులకు చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన మానసిక ప్రశాంతత ఏర్పడి చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పలు అఘాయిత్యాలను, చెడును ప్రదర్శన రూపంలో చూపారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు సర్పంచ్ ఉప సర్పంచ్ నాయకులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మా వెంకటయ్య, పాఠశాల కరస్పాండెంట్ కట్టా వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊట్కూరు వేమన రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్,సైన్స్ నాలెడ్జ్ అవగాహన కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**




కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు కే టి ఎస్ ఆవిష్కార్ రోబో టిక్స్ 2026 కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ శ్రీనివాసరావు సీఐ వెంకట్ రెడ్డి గౌరవ అతిథిగా డాక్టర్ రఘువీరా చారి పాఠశాల డైరెక్టర్ రాజ్ కుమార్ రెడ్డి రోబోటిక్స్ వ్యవహార కర్త శర్మ జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించినాయి.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు అత్యంత అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో ఒకటిగా ఉన్నా రోబోటిక్స్ ఏఐ టెక్నాలజీ కోడింగ్ తమ జీవితంలో ప్రారంభ దశలో నేర్చుకున్నట్లయితే వారికి ప్రయోజనం చేకూరుతుందని రోబోటిక్స్ వల్ల ఊహాశక్తి ఏకాగ్రత శ్రద్ధ పరిశీలన నైపుణ్యాలు పెంపొందుతాయని తెలియజేసినారు.

సీఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిందని నైపుణ్య అభివృద్ధి సామర్థ్యం ఉన్నవారే ఉపాధి పొందుతున్నారని టెక్నాలజీ ఉపయోగించుకొని యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ గౌడ్ వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హుస్సేన్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదే విధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





## ఈ ముద్దుగుమ్మ మార్షల్ ఆర్ట్స్ లో తోపు

రితిక నటి మాత్రమే కాదు ఆమె గొప్ప మార్షల్ ఆర్టిస్ట్ కూడా.. చిన్నప్పటి నుంచి ఈ ముద్దుగుమ్మకు క్రీడలంటే మక్కువ ఎక్కువ. అంతే కాదు ఆమె బాక్సర్ కూడా.. ఈ అమ్మడు 2009లో ఆసియా ఇండోర్ గేమ్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. అలాగే సూపర్ ఫైట్ లీగ్‌ను గెలిచింది. దీని తరువాత, ఆమె సుధా కొంగర దర్శకత్వం వహించిన "ఇరుతి చూడ్" చిత్రంలో ప్రధాన పాత్రలో నటించడంతో నటిగా అరంగేట్రం చేసింది. రితిక నటి మాత్రమే కాదు ఆమె గొప్ప మార్షల్ ఆర్టిస్ట్ కూడా.. చిన్నప్పటి నుంచి ఈ ముద్దుగుమ్మకు క్రీడలంటే మక్కువ ఎక్కువ. అంతే కాదు ఆమె బాక్సర్ కూడా.. ఈ అమ్ముడు 2009లో ఆసియా ఇండోర్ గేమ్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. అలాగే సూపర్ ఫైట్ లీగ్‌ను గెలిచింది. దీని తరువాత, ఆమె సుధా కొంగర దర్శకత్వం వహించిన "ఇరుతి చూడ్" చిత్రంలో ప్రధాన పాత్రలో నటించడంతో నటిగా అరంగేట్రం చేసింది. రజనీకాంత్, రాఘవ లారెన్స్, మాధవన్, విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్, విజయ్ ఆంటోని వంటి చాలా మంది నటుల చిత్రాలలో నటించింది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో రితిక షేర్ చేసే ఫోటోలు అభిమానులను కవ్విస్తుంటాయి.



## వెంకటేష్ అనిల్ రావిపూడి కాంబోలో మరో చిత్రం.. హీరోయిన్‌గా ఆ అందాల బ్యూటీని ఎంపిక చేశారా..!

టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచిన విక్టరీ వెంకటేష్ - అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబినేషన్‌లో ఐదో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్ 2, ఎఫ్ 3వంటి చిత్రాలు భారీ విజయాన్ని సాధించాయి. అలాగే సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు వంటి చిత్రాలు కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో మరో ఎంటర్‌టైనింగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నందమూరి కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఆయన పాత్ర కథలో కీలక మలుపు తిప్పేలా ఉంటుందని తెలుస్తోంది. వెంకటేష్ - కళ్యాణ్ రామ్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ సినిమాలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలుస్తోంది. మహానటి చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు సమాచారం. అయితే కళ్యాణ్ రామ్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎంపిక ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించనుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి చేపట్టనున్నారు. నిర్మాణ బాధ్యతలను షైన్ స్క్రీన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నటిస్తున్న సినిమా పూర్తికాగానే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది. జూన్ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. అనిల్ రావిపూడి ప్రత్యేకమైన కామెడీ స్టైల్, వెంకటేష్ టైమింగ్ కామెడీకి తోడు కళ్యాణ్ రామ్ పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండనుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. టాలీవుడ్‌లో మరో బిగ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం నిలిచే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వినోదాలు పంచే బాల్‌రాజ్



నటుడిగా, దర్శకుడిగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు తరుణ్‌భాస్కర్. ఆయన కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులు. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం హోలి పర్వదినాన్ని పురస్కరించుకొని బాల్‌రాజ్ పాత్రలో తరుణ్‌భాస్కర్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆయన సూపర్‌మ్యాన్ స్టైల్ గెటప్‌లో జోష్‌గా కనిపిస్తున్నారు. పెళ్లి చుట్టూ సాగే వినోదాత్మక కథ ఇదని, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్‌బొబ్బిలి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: బద్రప్ప గాజుల.




**ఉగాది రోజున ప్రదానం**

**బెస్ట్ మూవీ - రాజు వెడ్స్ రాంబాయి**

తెలంగాణ ప్రభుత్వం 2025వ సంవత్సరానికి గద్దర్ అవార్డ్స్ అనౌన్స్ చేసింది. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజుతో పాటు సభ్యులు ఈ అవార్డులు అనౌన్స్ చేశారు. స్పెషల్ జ్యూరీ అవార్డులను తమ్మారెడ్డి భరద్వాజ అనౌన్స్ చేశారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకూ CBFC ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలు, షార్ట్ ఫిల్మ్స్‌కు ఈ అవార్డ్స్ ప్రకటించారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఈ నెల 19న అవార్డులు ప్రధానం చేయనున్నారు. చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయం సాధించిన మూవీ రాజు వెడ్స్ రాంబాయి ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ హీరోగా నాగ చైతన్య (తండేల్), హీరోయిన్‌గా రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్) నిలిచారు. స్పెషల్ జ్యూరీ అవార్డుల్లో మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ అవార్డు వరించింది.

బెస్ట్ మూవీ రాజు వెడ్స్ రాంబాయి
బెస్ట్ సెకండ్ మూవీ దండోరా
బెస్ట్ థర్డ్ మూవీ ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
బెస్ట్ యాక్టర్ నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్)
బెస్ట్ డైరెక్టర్ సాయిలు కంపాటి (రాజు వెడ్స్ రాంబాయి)
బెస్ట్ డాక్యుమెంటరీ యూనిటీ
బెస్ట్ ఎంటర్టైన్మెంట్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం
బెస్ట్ చైల్డ్ మూవీ అనగనగా
బెస్ట్ సోషల్ మెసేజ్ మూవీ కోర్ట్
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ నేషనల్ ఇంటిగ్రేషన్ తండేల్
ఉత్తమ సహాయ నటుడు శివాజీ
ఉత్తమ సహాయ నటి భూమిక (యుఫోరియా)
బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ రాబిన్ (దండోరా)
బెస్ట్ మేల్ సింగర్ అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
బెస్ట్ ఫీమేల్ సింగర్ సాహితీ (కన్నప్ప)
బెస్ట్ లిరిసిస్ట్ నంద కిశోర్ (కుబేర పచ్చ పచ్చని చేలల్లో)
బెస్ట్ ఎడిటర్ శ్రీకర ప్రసాద్ (మిరాయ్)
బెస్ట్ స్క్రీన్ ప్లే అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
బెస్ట్ స్టోరీ రైటర్ గుణశేఖర్ (యుఫోరియా)
బెస్ట్ సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్)
బెస్ట్ పర్యావరణ చిత్రం ఇగ్వా
బెస్ట్ స్పెషల్ ఎఫెక్స్ మూవీ మిరాయ్
బెస్ట్ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ లిటిల్ హార్ట్స్
బెస్ట్ కామెడీ యాక్టర్ శ్రీకృష్ణ తేజ (జిగ్రిస్)
బెస్ట్ ఆడియోగ్రాఫర్ ఎం ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి)
బెస్ట్ కొరియోగ్రాఫర్ ఆట సందీప్ (గిర గిర గింగిరా గిరే ఛాంపియన్)
బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ తోట తరణి (ఛాంపియన్)
బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ గోవింద్ (అఖండ)
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ చంద్రకాంత్ (ఛాంపియన్)
బెస్ట్ స్పెషల్ జ్యూరీ మూవీ 23
స్పెషల్ జ్యూరీ హీరో రోషన్ (ఛాంపియన్)
స్పెషల్ జ్యూరీ అవార్డులు
ఎన్టీఆర్ నేషనల్ అవార్డు మెగాస్టార్ చిరంజీవి
సినారె అవార్డు ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ
పైడి జయరాజ్ అవార్డ్ యూనివర్సల్ హీరో కమల్ హాసన్
అక్కినేని నాగేశ్వరరావు అవార్డు జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ కైవసం చేసుకున్నారు.
బిఎన్ రెడ్డి అవార్డు సింగీతం శ్రీనివాసరావు
కాంతారావు అవార్డు ఆర్ నారాయణ మూర్తి



## 18 ఏళ్లకే పెళ్లి.. 20ఏళ్లకే తల్లి..!

ఒకప్పుడు రూ. 500కి పని చేసింది. కట్ చేస్తే ఇప్పుడు రూ. 83 కోట్లకు మహారాణి ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఈ ముద్దుగుమ్మకు 18ఏళ్లకే పెళ్లైంది.. 20 ఏళ్లకే తల్లైంది ఆతర్వాత రెండు సార్లు విడాకులు తీసుకుంది. ఒకప్పుడు నెలకు రూ.500 సంపాదించిన ఆమె.. ఇప్పుడు ఒక్క ఎపిసోడ్ కోసం ఏకంగా రూ.3 లక్షలు తీసుకుంటుంది. ఇంతకీ ప్రస్తుతం ఆమె ఆస్తులు రూ.83 కోట్లు. అంతేకాదు.. ఆమె వయసు ఇప్పుడు 44 సంవత్సరాలు. కానీ ఇప్పటికీ ఏమాత్రం తగ్గని అందంతో పాతికేళ్ల హీరోయిన్లకు గట్టిపోటినిస్తుంది. ఆమె ఎవరో కాదు బాలీవుడ్ అందాల భామ శ్వేతా తివారి. బాలీవుడ్ లో ఈ అమ్మడు సినిమాలు, సీరియల్స్ చేసి పాపులర్ అయ్యింది. కాగా ఈ అమ్మడి కి 18 ఏళ్లకే వివాహం జరిగింది. ఆతర్వాత 20 ఏళ్లకే బిడ్డకు జన్మనిచ్చింది. ఆతర్వాత భర్తతో విడిపోయింది. మరొక నటుడిని పెళ్లాడింది. అతనితో ఓ బిడ్డకు జన్మనిచ్చింది. కానీ ఆతర్వాత అతనితోనూ విడిపోయింది. కెరీర్ బిగినింగ్ లో ఆమె ఒక ట్రావెల్ ఏజెన్సీలో ఉద్యోగం చేసింది. అప్పుడు ఆమెకు నెలకు కేవలం రూ. 500 జీతం మాత్రమే లభించింది. 15 సంవత్సరాల వయసులో, శ్వేత ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**